# సాక్షి రంగారెడ్డి

సోమవారం ౹ 2 ౹ డిసెంబర్ ౹ 2024




**చిరుత కలకలం!**

చిరుత సంచారం ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎల్మినేడు గ్రామంలో ఆదివారం కలకలం రేపింది. 8లో▸



**విద్య, వైద్యానికి ప్రాధాన్యం**

విద్య, వైద్యానికి రేవంత్ రెడ్డి సర్కార్ ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. 8లో▸



**రైతు సంక్షేమమే ధ్యేయం**

రైతు సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. 8లో▸

## న్యూస్‌రీల్

### ఉత్సాహంగా 2కే రన్



ర్యాలీలో పాల్గొన్న క్రీడాకారులు తదితరులు

హుడాకాంప్లెక్స్: ప్రజాపాలన– ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో చీఫ్ మినిస్టర్ కప్ 2కే రన్ నిర్వహించారు. స్టేడియం నుంచి ఎల్‌బీనగర్ క్రాస్‌రోడ్డు మీదుగా బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించినట్లు జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ తహసీల్దార్ పి.వేణుగోపాల్, వినోద్‌కుమార్, ఎల్‌బీనగర్ సీఐ నాగరాజు, శిక్షకులు, ఉద్యోగులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

### విద్యారంగానికి ప్రాధాన్యం ఇవ్వాలి

ప్రొఫెసర్ హరగోపాల్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం విద్యారంగానికి బడ్జెట్‌లో ప్రాధాన్యమిస్తూ ఎక్కువ నిధులు కేటాయించాలని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. పట్టణంలోని సాయిరాజా ఫంక్షన్ హాలులో ఆదివారం డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి ఉద్యోగ విరమణ, విద్యా సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హరగోపాల్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత పాలకులు చేసిన తప్పులే ప్రస్తుత పాలకులు చేస్తున్నారని విమర్శించారు. విద్యావిధ్వంసానికి అనేక కారణాలు ఉన్నాయని వాటిపై దృష్టి సారించాలని కోరారు. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలన్నారు. ఉపాధ్యాయ వృత్తి పాఠశాలకే పరిమితం కాదని, సామాజిక బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. విద్యారంగం నిర్వీర్యానికి గత పాలకులే కారణమని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో మేధావులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన భూ నిర్వాసితులు



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న భూ బాధితులు

మహేశ్వరం: ఫ్యూచర్ సిటీలో 300 ఫీట్ల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు ఆదివారం కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు అన్ని విధాలా న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. రైతులకు ఇష్టం లేకుండా భూసేకరణ చేపట్టే అధికారం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని కిషన్ రెడ్డి అన్నారు. రైతులు అధైర్యపడొద్దని, బీజేపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకట్‌రెడ్డి, మహేశ్వరం అసెంబ్లీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి జంగయ్య యాదవ్, సీనియర్ నాయకులు అమరేందర్‌రెడ్డి, మాదారం రమేష్ గౌడ్, వెంకటేశ్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

### సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ నియామకం

షాబాద్: సర్దార్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని ప్రభుత్వం ప్రకటించింది. చైర్మన్‌గా మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లికి చెందిన పీసరి సురేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్‌గా మొయినాబాద్ మండలం తోల్కట్ట గ్రామానికి చెందిన బోడ చిన్న జంగయ్య, డైరెక్టర్లుగా మహ్మద్ అక్తర్‌పాషా, గుండాల నర్సింహులు, అంగోత్ లలిత, బాలకృష్ణారెడ్డి, పి.శ్రీనివాస్ రెడ్డి, కావలి రమేశ్, కొత్త జైపాల్‌రెడ్డి, బి.సత్యనారాయణను నియమిస్తూ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. నూతన పాలకవర్గం త్వరలో ప్రమాణ స్వీకారం చేయబోతున్నట్లు సమాచారం.

## ఒక్కోరోజు ఒక్కోచోట

### మున్సిపాలిటీలను వేధిస్తున్న టీపీఓల కొరత

- జిల్లాలోని 16 పురపాలికలకు ఐదుగురే..
- షిఫ్ట్ పద్ధతిలో విధులు
- నిర్మాణ అనుమతుల్లో తీవ్ర జాప్యం
- ఔట్ సోర్సింగ్ సిబ్బందిదే హవా
- ముందుకు సాగని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన




సాక్షి, రంగారెడ్డిజిల్లా: పట్టణాభివృద్ధిలో టౌన్ ప్లానింగ్ విభాగం పాత్ర కీలకమైంది. కొత్త నిర్మాణాలకు అనుమతుల జారీ.. అక్రమ నిర్మాణాల గుర్తింపు.. వాటి నియంత్రణ.. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన.. కోర్టు కేసుల వంటి పనుల్లో టౌన్‌ప్లానింగ్ అధికారులే (టీపీఓ) కీలకంగా వ్యవహరిస్తుంటారు. అలాంటి టీపీఓలు జిల్లాలోని 13 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లకు ఐదుగురు మాత్రమే ఉన్నారు. ఒక్కొక్కరు రెండు మూడు మున్సిపాలిటీలకు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. షిఫ్టుల పద్ధతిలో పని చేస్తున్నారు. వారానికి మూడు రోజులు ఒక మున్సిపాలిటీలో ఉంటే.. మరో మూడు రోజులు ఇంకో మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో నిర్మాణ అనుమతుల జారీలో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. టీఎస్‌బీపాస్ కింద దరఖాస్తు చేసుకున్న వారికి 24 గంటల్లోనే అనుమతులు జారీ చేయాల్సి ఉన్నా రెండు మూడు వారాలైనా రావడం లేదు.

**షిఫ్ట్ పద్ధతిలో విధులు**

- ఇబ్రహీంపట్నం టీపీఓ తుర్కయంజాల్, షాద్‌నగర్ మున్సిపాలిటీల్లో ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ టీపీఓ ఒక్కో మున్సిపాలిటీలో రెండు రోజుల చొప్పున పని చేయాల్సి వస్తోంది. సోమ, మంగళవారాల్లో తుర్కయంజాల్ మున్సిపాలిటీలో ఉంటుండగా.. బుధ, గురు వారాల్లో షాద్‌నగర్ మున్సిపాలిటీలో.. శుక్ర, శని వారాల్లో ఇబ్రహీంపట్నంలో ఉంటున్నారు.
- తాండూరు మున్సిపాలిటీకి చెందిన టీపీఎస్ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు టీపీఓ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. గురు, శుక్ర, శనివారాల్లో అందుబాటులో ఉంటారు. నెలకు సగటున 150 దరఖాస్తులు వస్తుంటాయి. వందకు పైగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడే లేడు.
- వికారాబాద్ మున్సిపాలిటీకి చెందిన టీపీఎస్ మీర్‌పేట్ మున్సిపాలిటీ సహా మేడ్చల్ జిల్లాలోని పోచారం మున్సిపాలిటీలోనూ టీపీఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. సోమ, మంగళ వారాల్లో మాత్రమే మీర్‌పేట్‌లో ఉంటారు. మిగిలిన రోజుల్లో ఇతర మున్సిపాలిటీల్లో ఉంటున్నారు.
- సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన టీపీఎస్ తుక్కుగూడ మున్సిపాలిటీలో టీపీఓ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీశైలం జాతీయ రహదారి వెంట ఉన్న వ్యవసాయ భూముల్లో అక్రమ షెడ్లు, సెల్లార్ల తవ్వకాలు చేపడుతున్నారు. వక్ఫ్ భూముల్లో బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా అడ్డుకునే వారే లేకుండా పోయారు. అక్రమ నిర్మాణాలకు రూ.2 లక్షలు తీసుకుని ఇంటి నంబర్లు కూడా జారీ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన టీపీఓ ఆదిబట్ల మున్సిపాలిటీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. సోమ, మంగళ, బుధ వారాల్లో మాత్రమే అందుబాటులో ఉంటారు. హెచ్‌ఎండీఏ జీ+4 నిర్మాణాలకు, మున్సిపాలిటీ జీ+2 నిర్మాణాలకు అనుమతి ఇస్తోంది.
- బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోనూ డీసీపీ సహా టీపీఎస్ సైతం షిఫ్ట్ పద్ధతుల్లోనే పని చేస్తున్నారు. వీరిద్దరూ కూడా వారానికి మూడు రోజుల చొప్పున షిఫ్ట్ పద్ధతిలోనే పని చేస్తున్నారు.

**అక్కడ చైన్‌మెన్‌లదే హవా..**

నిజానికి ప్రతి మున్సిపాలిటీలో విధిగా డిప్యూటీ సిటీప్లానర్ (డీసీపీ), అసిస్టెంట్ సిటీప్లానర్ (ఏసీపీ), టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ (టీపీఓ), టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ (టీపీఎస్)తో పాటు చైన్‌మెన్ సిస్టం ఉండాలి. నిర్మాణ సైట్ వెరిఫికేషన్ మొదలు అక్రమ నిర్మాణాల గుర్తింపు, స్థానిక ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల పరిష్కారం, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన వంటి పనులు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగులు కాకుండా ఔట్ సోర్సింగ్ సిబ్బందితో చైన్‌మెన్ సిస్టం ఏర్పాటు చేయడంతో వారే టీపీఓలుగా చలామణి అవుతూ అక్రమ నిర్మాణదారుల నుంచి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. రాష్ట్రంలోనే అత్యధిక నిర్మాణాలు బడంగ్‌పేట్, తుర్కయంజాల్, పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీల్లో కొనసాగుతున్నాయి. కీలకమైన ఈ మున్సిపాలిటీల్లోనూ రెగ్యులర్ టీపీఓలు లేని పరిస్థితి.

## ఏడాది పాలనలో అన్నీ వైఫల్యాలే

- కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు
- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్



సభాస్థలిని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ ఈటల రాజేందర్

హుడాకాంప్లెక్స్: ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ఈ నెల 7న (శనివారం) సరూర్‌నగర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. ఏడాది కాంగ్రెస్ పాలనలో వైఫల్యాలను ఈ వేదిక ద్వారా వివరించనుంది. ఈ మేరకు ఆదివారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సభాస్థలిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడాది పాలనలో కాంగ్రెస్ చేసిందేమీ లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో పేదలకు కంటిమీద కునుకులేకుండా చేశారని విమర్శించారు. లగచర్ల రైతులకు సంకెళ్లు వేశారని మండిపడ్డారు. జిల్లాలో 30 వేల ఎకరాల్లో కొత్త నగరం నిర్మిస్తామని చెబుతున్నారని, రైతుల అంగీకారం మేరకే భూమి సేకరించాలని డిమాండ్ చేశారు. ఫోర్త్‌సిటీకి ఇప్పటికే రెండు రోడ్లు ఉన్నప్పటికీ తొమ్మిది గ్రామాల నుంచి 300 ఫీట్ల రోడ్డు వేయాలని చూస్తున్నారని అన్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ రోడ్లను విస్తరించాలే కానీ కొత్త రోడ్ల కోసం బలవంతపు భూ సేకరణకు పాల్పడితే ఆందోళన తప్పదని ఆయన హెచ్చరించారు.

## విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్



సైన్స్ టాలెంట్ టెస్ట్ పేపర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

తుర్కయంజాల్: జన విజ్ఞాన వేదిక, చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ జిల్లా స్థాయి పరీక్ష ఆదివారం తుర్కయంజాల్ లార్డ్స్ హైస్కూల్‌లో నిర్వహించారు. లార్డ్స్ గ్రూప్ స్కూల్స్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పరీక్ష పేపర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు నిరంతరం నేర్చుకోవాలనే కుతూహలంతో ఉండాలని అన్నారు. ప్రతీ విషయాన్ని పరిశోధించాలని, అప్పుడే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని పేర్కొన్నారు. 30 ఏళ్లుగా చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను జన విజ్ఞాన వేదిక వెలికితీయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు రాములయ్య, ప్రధాన కార్యదర్శి కుర్మయ్య, కోశాధికారి సాయిబాబు, సత్యం, ప్రకాష్, చిన్ని కృష్ణ, జహంగీర్, స్కూల్ ప్రిన్సిపాల్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి సమీపంలో కాలుష్య జలాలతో నిండిన చెరువును పరిశీలిస్తున్న రైతులు

## 'ఫార్మా' రైతుల చలో పటాన్‌చెరు బస్సు యాత్ర

యాచారం: ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు ఆదివారం 'చలో పటాన్‌చెరు బస్సు యాత్ర' చేపట్టారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద, మర్లకుంట తండాల నుంచి రెండు బస్సుల్లో 120 మంది రైతులు తరలివెళ్లారు. పటాన్‌చెరు, సంగారెడ్డి సమీప గ్రామాలైన కాజిపల్లి, గడ్డపోతారం, కిష్టయ్యపల్లి, పాశమైలారం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడి రైతులు ఫార్మా కంపెనీలతో పడుతున్న ఇబ్బందులను స్వయంగా పరిశీలించారు. రసాయన వ్యర్థాలతో ఆరోగ్యం ఏ విధంగా చెడిపోతోంది.. వ్యవసాయ పంటల పరిస్థితి.. పాడి పశువులకు వచ్చే వ్యాధులు.. మహిళలు కోల్పోయే గర్భాలు.. బోరుబావుల్లో కలుషిత నీరు రావడం వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు కవుల సరస్వతి, రామచంద్రారెడ్డి, మహేందర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిపరులకు మోదీ సర్కార్ అండ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ




మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం రూరల్: అవినీతి పరులకు కేంద్రంలో ఉన్న మోదీ సర్కార్ అండగా నిలుస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ ఆరోపించారు. పార్టీ ఇబ్రహీంపట్నం మండల 9వ మహాసభలు ఆదివారం ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని బొంగ్లూర్ సమీపంలో గల కల్లెం జంగారెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారుల కొమ్ముకాస్తోందని అన్నారు. ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చేందుకు మాత్రమే రాజ్యాంగ సంస్థలను వినియోగిస్తున్నారని విమర్శించారు. దేశంలో బీసీ గణన ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. దేశంలో ఆర్థిక సంక్షోభం, నిరుద్యోగం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయానికి బీజేపీ వ్యతిరేకమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తోందని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన విధానాలనే బీజేపీ కొనసాగిస్తోందని దుయ్యబట్టారు. జిల్లాలో ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్ భూముల్లో రూ.12వేల కోట్ల స్కాం జరిగిందని, ఈ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎత్తిచూపిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు విచారణ చేపట్టడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను పేదలకు ఇవ్వకుండా కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తోందన్నారు. ఈ ప్రాంతంలో 13 మెగా ప్రాజెక్టుల ఉన్నప్పటికీ స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, పేదల నుంచి తీసుకున్న భూములకు నష్టపరిహారంగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.సామేలు, పగడాల యాదయ్య, డి.జగదీష్, మండల కార్యదర్శి సీహెచ్ జంగయ్య, ఆదిబట్ల కార్యదర్శి తులసిగారి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## బల్దియాలో బలపడాలి

- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ప్రజాపాలన.. ప్రజా విజయోత్సవాలను జయప్రదం చేయాలి
- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ



మేయర్, పీసీసీ చీఫ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎమ్మెల్యేలు, ఇతర నేతలతో దీపాదాస్‌మున్షీ

సాక్షి, సిటీబ్యూరో/బంజారాహిల్స్: జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో విజయం సాధించాలంటే కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాల్సిన అవసరముందని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు–2024 పేరుతో ఈ నెల 7, 8, 9వ తేదీల్లో నగరంలో జరిగే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, డీసీసీ అధ్యక్షులు, ముఖ్య నేతలతో ఆదివారం బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాసంలో జరిగిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. జీహెచ్‌ఎంసీలో కాంగ్రెస్ బలహీనంగా ఉందని, పార్టీ, ప్రభుత్వం సమన్వయం చేసుకుంటేనే విజయాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ హయాంలో అమలు కాని పథకాలను.. కాంగ్రెస్ ఒక్క సంవత్సరంలో అమలు చేసి చూపించిందన్నారు. క్షేత్ర స్థాయిలో చేస్తున్న పనులు కూడా చెప్పడంలో కాంగ్రెస్ కార్యకర్తలు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనుంచి కలిసికట్టుగా పని చేయాలని ఆమె సూచించారు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. బల్దియా ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తే మేయర్ పదవి మనకే దక్కుతుందన్నారు. త్వరలోనే జీహెచ్‌ఎంసీలో డివిజన్ల వారీగా పాదయాత్ర చేపట్టి పార్టీ బలోపేతం కోసం కార్యాచరణ దిశగా పయనించాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. విజయోత్సవాలకు గ్రేటర్ హైదరాబాద్ నుంచి భారీ జన సమీకరణ చేయాలన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీ గణేశ్, ఎమ్మెల్సీలు అమీర్ అలీఖాన్, ప్రభాకర్, కార్పొరేషన్ చైర్మన్లు ఫహీం, నూతి శ్రీకాంత్ గౌడ్, మెట్టు సాయి కుమార్, డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి, సమీర్ ల్లాఖాన్ పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పార్టీ నాయకులు

## ఆరు గ్యారంటీలు ఏమయ్యాయి?

- ప్రభుత్వాన్ని నిలదీసిన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- రైతు పండుగను రైతులే చేసుకోవాలి.. నాయకులు కాదని హితవు

అనంతగిరి: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయడం లేదని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం వికారాబాద్‌లో బీజేపీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రజాపాలనకు వ్యతిరేకంగా బైక్ ర్యాలీ చేపట్టారు. పార్టీ జిల్లా కార్యాలయం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ మోమిన్‌పేట, మర్పల్లి, బంట్వారం, కోట్‌పల్లి, ధారూర్ మీదుగా సాయంత్రం వికారాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 నుంచి 40 శాతం మంది రైతులకు మాత్రమే రుణ మాఫీ అమలు చేశారని అన్నారు. రైతు పండుగలు రైతులే చేసుకోవాలని రాజకీయ పార్టీలు కాదని హితవు పలికారు. తాము ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. ఏటా కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర నాయకులు సదానందరెడ్డి, వడ్లనందు, నవీన్‌కుమార్, నరోత్తంరెడ్డి, పాండుగౌడ్, నందు, చరణ్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ రాజశేఖర్, రాజు నాయక్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు అభివృద్ధికి సీఎం ప్రత్యేక దృష్టి


షాద్‌నగర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పాలమూరు జిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలమూరు అభివృద్ధికి ఏటా బడ్జెట్‌లో నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. పెండింగ్‌లో ప్రాజెక్టులను పూర్తి చేసి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నా ముఖ్యమంత్రి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, నాయకులు తిరుపతిరెడ్డి, చెన్నయ్య, బాల్‌రాజ్‌గౌడ్, రాయికల్ శ్రీను, అన్వర్, చింటోడ్ అనంతం తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి**

నందిగామ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని ఐదు జెడ్పీహెచ్‌ఎస్‌ల విద్యార్థులకు పలు అంశాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓ శ్రీనివాస్ అధ్యక్షతన బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. విద్యావ్యవస్థను బాగు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. తాను విద్యనభ్యసించిన నందిగామ జెడ్పీహెచ్‌ఎస్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీడీఓ సుమతి, ఎంఈఓ శ్రీనివాస్, హెచ్‌ఎం సుధాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్, నాయకులు రాంరెడ్డి, కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, దేపల్లి కుమార్ గౌడ్, నర్సింహ, కావలి కృష్ణ, పురుషోత్తం రెడ్డి, అంజి యాదవ్, నర్సింగ్, జంగయ్య, శ్రీకాంత్ గౌడ్, రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్కూటీని ఢీకొట్టిన కారు

**ముగ్గురికి గాయాలు**

మొయినాబాద్: అతివేగంతో ఎదురుగా వచ్చిన కారు, స్కూటీని ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన లింగగల్ల శ్రీశైలం, ఆంజనేయులు, శ్రీహరి కలిసి శనివారం రాత్రి స్కూటీపై కనకమామిడి గ్రామానికి వెళ్లారు. తిరిగి రాత్రి 10 గంటల సమయంలో స్కూటీపై మొయినాబాద్‌కు వస్తుండగా తాజ్ హోటల్ సమీపంలోకి రాగానే ఎదురుగా అతి వేగంతో వచ్చిన కారు, స్కూటీని ఢీకొట్టింది. దీంతో స్కూటీపై ఉన్న ముగ్గురు రోడ్డుపై పడిపోవడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

## రెండు బైక్‌లు ఢీ

**ఒకరి మృతి**

శంకర్‌పల్లి: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని మహాలింగాపురం గ్రామానికి చెందిన ఫకీర్ పాషా(60) వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సాయంత్రం ఆయన బైక్‌పై శంకర్‌పల్లి వెళ్తుండగా రావులపల్లి శివారులో శంకర్‌పల్లి నుంచి వికారాబాద్‌వైపు వెళ్తున్న గుర్తితెలియని ద్విచక్రవాహనదారుడు ఫకీర్‌పాషా బైక్‌ను ఢీకొట్టాడు. ఫకీర్‌పాషాకు తలకు గాయాలవ్వడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

## చోరీ కేసులో ఇద్దరికి రిమాండ్

ఇబ్రహీంపట్నం: సెల్ ఫోన్‌తోపాటు నగదును ఎత్తుకెళ్లిన ఇద్దరు దుండగులను ఆదివారం ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ సత్యనారాయణ తెలిపిన ప్రకారం.. నవంబర్ 28న అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మన్నెగూడ గ్రామానికి చెందిన పిల్లి అజయ్(18), అతని స్నేహితుడు ఎట్టి మహేశ్(18)తో కలిసి బైక్‌పై మంగల్‌పల్లికి వచ్చారు. రాఘవేంద్ర హోటల్ వద్దకు రాగానే మహేశ్‌కు ఫోన్ రావడంతో అజయ్ బైక్ ఆపాడు. ఇంతలో ముగ్గురు వ్యక్తులు యాక్టివాపై వచ్చి మొబైల్ ఫోన్‌ను అడిగి తీసుకోగా మరో వ్యక్తి వాహనం దిగి అజయ్‌ను కొట్టి అతని ప్యాంటు జేబులోంచి రూ.3వేల నగదుతో ఉడాయించారు. ఈ మేరకు వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి కర్మన్‌ఘాట్‌లో నివసించే నిందితులైన పెర్ల అజయ్‌కుమార్(20), అంకురు ముఖేష్(18)ను పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే కసిరెడ్డి, నాయకులు

కడ్తాల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పాలమూరు జిల్లాలో నిర్వహించిన రైతు పండుగ సభకు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతానికి కృషి చేసిన రైతులకు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని మైసిగండిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతు సంక్షేమ పాలన అందుతుంది అనేందుకు నిదర్శనం రైతు పండుగకు తరలివచ్చిన ప్రజానీకమే అన్నారు. రుణమాఫీపై ప్రతిపక్ష నాయకులు అబద్ధాలు ప్రచారం చేయడం తగదని, ప్రభుత్వంపై బురదచల్లేందుకు యత్నించడం మానుకోవాలని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, మాజీ వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, నాయకులు వెంకటేశ్వర్లుగౌడ్, చేగూరి వెంకటేశ్, నరేశ్‌నాయక్, హీరాసింగ్, యాదయ్యగౌడ్, జవహర్‌లాల్, సత్యంయాదవ్, జహంగీర్‌అలీ, రాంచందర్‌నాయక్, షాబుద్దీన్, ఇమ్రాన్ బాబా తదితరులు ఉన్నారు.

**విద్యారంగానికి పెద్దపీట**

ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించారు. ఎంఈఓ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగాహాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కల్వకుర్తి నియోజకవర్గంలో రూ.125 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్‌ను సీఎం మంజూరు చేశారని చెప్పారు. త్వరలోనే తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామ సమీపంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ పనులను ప్రారంభించడం జరుగుతుందని వివరించారు. అనంతరం జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించి, సన్మానించారు. అదే విధంగా ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీ మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఆహ్వాన పత్రిక అందజేత**

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని, మండల కేంద్రానికి చెందిన భగత్ సింగ్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం భగత్ సింగ్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ భవనం, అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరవ్వాలని ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు శ్రీనివాస్, మహేశ్, మహేందర్, అంజయ్య, జంగయ్య, నర్సింహ, శంకరయ్య, శివ తదితరులు ఉన్నారు.

# రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం


లక్ష్మారెడ్డి, భాగ్యలక్ష్మి దంపతులు(ఫైల్)

చేవెళ్ల: ఎదురెదురుగా వస్తున్న లారీ, కారు ఢీకొన్న ఘటనలో దంపతులు దుర్మరణం చెందారు. ఈ దుర్ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూర్ గ్రామానికి చెందిన మేకల లక్ష్మారెడ్డి(62), భాగ్యలక్ష్మి(48) దంపతులు. లక్ష్మారెడ్డి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం బీడీఎల్‌లో ఉద్యోగి. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు మనోహర్‌రెడ్డి లండన్‌లో ఉద్యోగం చేస్తుండగా.. చిన్న కుమారుడు రాజశేఖర్‌రెడ్డికి ఇటీవలే ఎయిర్‌ఇండియాలో ఉద్యోగం వచ్చింది. ఆయన సోమవారం ఉద్యోగంలో చేరాల్సి ఉంది. ఆదివారం లక్ష్మారెడ్డి భార్యతో కలిసి మండల పరిధిలోని దేవరంపల్లిలో ఉండే తోటి అల్లుడు దగ్గరకి తమ కారులో బయలుదేరారు. హైదరాబాద్–బీజాపూర్ రహదారిలో వెళ్తుండగా మిర్జాగూడ స్టేజీ సమీపంలో లారీ, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. కారు వేగంగా ఉండడంతో లారీని ఢీకొని అదే వేగంతో పక్కనే ఉన్న మర్రిచెట్టుని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భాగ్యలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా.. లక్ష్మారెడ్డిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ప్రమాదంతో రోడ్డుపై గంటల తరబడి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

# విద్య, వైద్యానికి ప్రాధాన్యం

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం నిరంతరం పనిచేస్తుందని.. విద్య, వైద్యానికి రేవంత్ సర్కార్ ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇబ్రహీంపట్నం జెడ్పీహెచ్‌ఎస్ (బాలికల) విద్యారంగంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు మౌలిక వసతులతోపాటు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషిచేస్తానన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని డీఈఓను ఆదేశించారు. బాలికల పాఠశాలల్లోని సమస్యలపై నివేదిక ఇస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. హాస్టల్స్‌లో, పాఠశాలల్లో ప్రత్యేకంగా ఒక రిజిస్టర్‌ను ఏర్పాటు చేయిస్తానని.. అందులో సమస్యలను, ఇబ్బందులను నిర్భయంగా రాయాలని విద్యార్థులకు సూచించారు. హాస్టల్స్‌లో అవకతవకలకు పాల్పడేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి 25 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ఆర్డీఓ అనంతరెడ్డిని కోరారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా వ్యాసరచన పోటీల విజేతకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ సుశీందర్‌రావు, ఆర్డీఓ అనంతరెడ్డి, మండల స్పెషలాఫీసర్ నవీన్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ స్రవంతి, వైస్ చైర్‌పర్సన్ మంగయాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, కాంగ్రెస్ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, శంకర్‌గౌడ్, జగదీశ్ యాదవ్, నెల్లికుమార్, చందు, సుధాకర్, వీరేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఫాంహౌస్‌లపై పోలీసుల దాడులు

**అనుమతి లేకుండా పార్టీలు నిర్వహించినవారిపై కేసులు**

మొయినాబాద్: ఎలాంటి అనుమతులు లేకుండా పార్టీలు నిర్వహిస్తున్న ఫాంహౌస్‌లపై దాడులు చేసిన పోలీసులు నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఎనికేపల్లిలోని జేఎల్‌ఆర్ ఫాంహౌస్, చాకలిగూడలోని అట్లల్ శంకర్ జగదాంబ ఫాంహౌస్, అజీజ్‌నగర్‌లోని ద్వారా కన్వెన్షన్‌లలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు అనుమతులు లేకుండా డీజేలు పెట్టి, మద్యం సేవిస్తూ పార్టీలు నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఫాంహౌస్‌లపై దాడులు చేశారు. డీజే బాక్సులు, మద్యం బాటిళ్లు, హుక్కా స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేకుండా పార్టీలు నిర్వహిస్తున్న నిర్వాహకులతోపాటు ఫాంహౌస్‌ల యాజమాన్యాలపై కేసులు నమోదు చేశారు.

## కానిస్టేబుల్ కిష్టయ్యకు గుర్తింపు ఇవ్వాలి

**ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరి ముదిరాజ్**


కానిస్టేబుల్ కిష్టయ్య చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు

మీర్‌పేట: ప్రత్యేక రాష్ట్ర సాధనకు కానిస్టేబుల్ కిష్టయ్య ప్రాణత్యాగం చేశారని ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరి ముదిరాజ్ అన్నారు. ఆదివారం కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతి సందర్భంగా జిల్లెలగూడ కమలానగర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. మలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో నాటి పాలకులకు వ్యతిరేకంగా, ఎక్కడ ఉద్యమం నీరు గారుతుందేమోనని మొదటి ఆత్మబలిదానం చేసుకుంది పోలీస్ కిష్టన్నే అని గుర్తు చేశారు. తెలంగాణ కోసం అమరుడైన కిష్టన్నకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సుదర్శన్, శివశంకర్, ఐలగోని కుమార్, మేకల కృష్ణ ముదిరాజ్, గంట రామకృష్ణ ముదిరాజ్, రాధాకృష్ణ, మన్యం శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## 118 జీఓను పునరుద్ధరించాలి

ఎల్బీనగర్: గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన జీఓ 118ను వెంటనే పునరుద్ధరించి 22–ఏ భూమి నిషేధిత చట్టం నుంచి తొలగించి ఇళ్ల రిజిస్ట్రేషన్లు అయ్యేలా చర్యలు తీసుకోవాలని పలు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఎస్‌కేడీనగర్ సంక్షేమ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పుల్లారెడ్డి, సుధాకర్ రెడ్డి, రాంబాబు, రాజీరెడ్డి, ముత్యంరావు మాట్లాడారు. బీఎన్ రెడ్డినగర్ డివిజన్ 118జీఓ బాధితుల ఐక్యవేదిక పేరుతో కొంత మంది కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఈ జీఓ గురించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఖాళీ స్థలాల ఆస్తి పన్నును ఇంటి పన్ను చెల్లించే వారికి రాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్‌గౌడ్, జగన్ మోహన్‌రెడ్డి, యాదగిరి,రాజుయాదవ్, కృష్ణారావు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్: ఎయిడ్స్ వ్యాధిపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని.. ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు అందరూ కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రభుత్వ ఆస్పత్రి నుంచి పరూఖ్‌నగర్‌లోని గాంధీ విగ్రహం వరకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ విజయలక్ష్మి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ వైరస్ మానవ శరీరంలో రోగనిరోధక శక్తిని తగ్గిస్తుందన్నారు. దీంతో జ్వరం, దగ్గు, విరోచనాలు, చర్మ వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. ఇలాంటి వ్యాధులు తీవ్ర స్థాయికి చేరుకున్న దశను ఎయిడ్స్ అంటారని చెప్పారు. అసురక్షిత సంభోగం, కలుషితమైన రక్తం ఎక్కించడం, కలుషిత సిరంజీలు, సూదులు వాడటం వలన ఈ వైరస్ వ్యాపిస్తుందని అన్నారు. హెచ్‌ఐవీ సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సిబ్బంది ప్రవీణ, శ్రీరామ, చంద్రకళ, అశోక్, రెడ్యానాయక్, రమేశ్, రవికుమార్, మల్లేష్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్మినేడులో చిరుత కలకలం


వివరాలు సేకరిస్తున్న అటవీశాఖ అధికారులు


పాదముద్రలు సేకరిస్తున్న అధికారులు

- వివరాలు సేకరించిన అధికారులు
- ఆనవాళ్లు కనిపించలేదని వెల్లడి

ఇబ్రహీంపట్నం రూరల్: చిరుత సంచారం మండల పరిధిలోని ఎల్మినేడు గ్రామంలో ఆదివారం కలకలం రేపింది. ఓ వ్యక్తి ఇంటి ఎదుట అరగంటపాటు సంచరించిందని చెప్పడంతో గ్రామంలో భయానక వాతావరణం నెలకొంది. గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున 4గంటల ప్రాంతంలో పెద్ద ఎత్తున కాకులు, కుక్కలు పెద్దగా శబ్దాలు చేయడంతో అరిగె యాదయ్య దంపతులు లేచి చూడగా ఇంటి ఎదుట చిరుత కనిపించింది. దీంతో వారు గ్రామస్తులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చినా ఎవరూ అక్కడకు రాలేదు. ఈ విషయం అటవీశాఖ అధికారులకు చెప్పడంతో వారు ఉదయం 7గంటల ప్రాంతంలో గ్రామానికి చేరుకున్నారు. ప్రత్యక్ష సాక్షి నుంచి వివరాలు సేకరించారు. పాదముద్రలు పరిశీలించారు. ఎక్కడా సరైన ముద్రలు లభించలేదని తెలిపారు. మల్లయ్య భార్యను అడగగా పొంతన లేని సమాధానం చెప్పటినట్లు అధికారులు తెలిపారు. రెండు రోజులుగా గ్రామంలో కొండెంగలు తిరుగుతున్నాయని గ్రామస్తులు వెల్లడించారు.

**ప్రజలు జాగ్రత్తగా ఉండాలి**

గ్రామంలో సమగ్రంగా విచారణ చేపట్టాం. ఎక్కడా సరైన ఆధారాలు లభించలేదు. చిరుత వస్తే గొర్రెలు, మేకలు, పశువులు, కుక్కలపై దాడి చేస్తుంది. అలాంటి దాడి జరగలేదు. ఒక్కోసారి హైనాలు సంచరిస్తుంటాయి. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. ఇప్పటికే డప్పు చాటింపు వేయించాం. ఒంటరిగా తిరుగవద్దని హెచ్చరించాం.

– సరిత, సెక్షన్ అధికారి, అటవీశాఖ

**కాకులు, కుక్కలు మొరిగాయి**

గ్రామంలోకి చిరుత వచ్చింది. దీంతో కాకులు, కుక్కలు మొరిగాయి. మా ఇంట్లోకి వచ్చేందుకు చూడగా భయంతో తలుపు వేశాం. కిటికిలోంచి పరిశీలిస్తే అక్కడే ఉంది. గ్రామస్తులకు ఫోన్ చేసినా ఎవరూ పట్టించుకోలేదు.

– అరిగె మల్లయ్య, ప్రత్యక్ష సాక్షి

## ఇంట్లోంచి వెళ్లిన వృద్ధురాలి మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం: ఇంట్లో నుంచి వెళ్లిపోయిన మతిస్థిమితంలేని మహిళ కాల్వలో పడి మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. పోచారం గ్రామానికి చెందిన గ్యార చెన్నమ్మ(60)కు మానసిక స్థితి సరిగాలేక పోవడంతో పాటుగా చూపు మందగించింది. శనివారం ఆమె ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె కుమారుడు మహేందర్ అదేరోజు రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా పోచారం చెరువుకాల్వలో చెన్నమ్మ పడి మృతిచెందినట్లుగా పోలీసులు ఆదివారం గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

## క్రీడలతో మానసికోల్లాసం

హస్తినాపురం: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జీఎంఆర్ టెన్నిస్ కోర్టులో నిర్వహించిన టోర్నమెంట్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని ప్రతిరోజు క్రీడలకు పాఠశాలలలో గంట సమయం కేటాయించాలన్నారు.